క్లుప్తంగా

మోదకొండమ్మ ఆలయ నిర్మాణానికి విరాళం


విరాళం అందజేస్తున్న భాస్కరరావు దంపతులు

మునగపాక: స్థానిక మోదకొండమ్మ ఆలయ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. పలువురు భక్తులు ఆలయ నిర్మాణంలో భాగస్వాములవుతున్నారు. మునగపాక బైపాస్ రోడ్డులో నిర్మిస్తున్న ఆలయానికి మునగపాకకు చెందిన శివకోటి భాస్కరరావు, వెంకటలక్ష్మి దంపతులు గురువారం రూ.10 వేలను విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలి


ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు

మునగపాక: ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించాలని నాగులాపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్ఎం శంకరరావు కోరారు. మండలంలోని నాగులాపల్లిలో మ్యాజిక్ బస్ సంస్థ ఆధ్వర్యంలో గురువారం ఉపాధ్యాయులు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులు సేవలందిస్తారన్నారు. ప్రైవేటు పాఠశాలల మోజులో పడి ఆర్థిక ఇబ్బందులు పడవద్దని కోరారు. తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి సారించి ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలన్నారు. మ్యాజిక్ బస్ సంస్థ ప్రతినిధి శ్యామల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా కొత్తమహాలక్ష్మి పండగ


ఊరేగింపులో భక్తులు

మునగపాక: స్థానిక ఉప్పరదిబ్బ ప్రాంతంలో కొత్తమహాలక్ష్మి అమ్మవారి పండగ గురువారం ఘనంగా నిర్వహించారు. ఏటా జూన్‌లో పండగను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఏడాది కూడా ఉప్పరిదిబ్బ ప్రాంత రైతులు, మహిళలు డప్పు వాయిద్యాలతో ఊరేగింపుగా ఆలయానికి వెళ్లి పూజలు చేశారు. కార్యక్రమంలో పెంటకోట వెంకట్, మళ్ల అప్పారావు, మళ్ల సూరిబాబు, ఆడారి అప్పలనాయుడు, మళ్ల సంతోష్, దాడి సీతారామ్, దాడి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

పెంటకోటలో వైద్య శిబిరం


రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

పాయకరావుపేట: మండలంలో పెంటకోట గ్రామంలో గురువారం ఉచిత వైద్యం శిబిరం నిర్వహించారు. కోస్టల్ సెక్యూరిటీ డీఐజీ గోపినాథ్ జెట్టి, విశాఖపట్నం కోస్టల్ సెక్యూరిటీ పోలీస్ అడిషనల్ ఎస్పీ జీబీఆర్ మధుసూదన్ రావు ఆదేశాలు మేరకు పెంటకోట కోస్టల్ సెక్యూరిటీ పోలీస్ స్టేషన్ సీఐ వై.మురళీరావు, ఎస్ఐ రత్నశేఖర్, ఏఎస్ఐ కృష్ణ, స్టేషన్ సిబ్బంది ఆధ్వర్యంలో ఈ శిబిరం నిర్వహించారు. గ్రామంతోపాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. వారికి ఉచిత వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు. కార్యక్రమంలో మంగవరం పీహెచ్‌సీ డాక్టర్ ఎస్.సంకీర్తి, డాక్టర్ జి.స్వరాజ్యం, ఎంపీహెచ్ఈవో పి.రాముడు, సూపర్‌వైజర్స్ కె.శ్రీనివాసరావు, డి.హేమంత, ఎంఎల్‌పీహెచ్ నాయుడు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వేడుకగా విగ్రహ ప్రతిష్ట


శరణ్య వేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ట చేస్తున్న భక్తులు

ఎస్.రాయవరం: అడ్డురోడ్డులో శరణ్య వేంకటేశ్వరస్వామి నూతన ఆలయంలో స్వామివారి విగ్రహ ప్రతిష్ట గురువారం వైభవంగా నిర్వహించారు. ఇక్కడ పంచ లోహాలతో తయారు చేసిన శరణ్య వేంకటేశ్వర స్వామివారిని పరిసర ప్రాంతాల భక్తులు దర్శించుకునే విధంగా ఆలయ నిర్మాణ కర్తలు ఏర్పాట్లు చేశారు. తిమ్మాపురం, పెదగుమ్ములూరు, కొరుప్రోలు తదితర గ్రామాల భక్తులు పూజలు చేశారు.

ఆధార్ అవస్థలు


ఎస్.రాయవరం కేంద్రం వద్ద వినియోగదారుల పడిగాపులు

- అప్‌డేట్, సవరణల కోసం కేంద్రాల కొరత
- గ్రామ సచివాలయాల్లో అందని సేవలు
- అడ్డురోడ్డులో కేంద్రం ఏర్పాటుకు వేడుకోలు

ఎస్.రాయవరం: ఆధార్ నమోదు చేసుకుని పదేళ్లు దాటిన ప్రతి ఒక్కరూ అప్‌డేట్ చేసుకోవాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. ఇప్పటికే పలుమార్లు గడువు పెంచుతూ వస్తోంది. ఈ నెల 14వ తేదీ వరకు తుది గడువు కావడంతో ఆధార్ అప్‌డేట్‌తోపాటు సవరణలు, తదితర అవసరాల కోసం ఆధార్ కేంద్రాలను ఆశ్రయిస్తున్నారు. అయితే కూటమి అధికారంలోకి వచ్చాక గ్రామ సచివాలయాల్లో ఆధార్ డ్రైవ్ నిర్వహించకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రాల్లో ఉన్న కేంద్రం వద్ద నిత్యం రద్దీగా ఉండటంతో సమయం వృథాతోపాటు వ్యయప్రయాసలు పడుతున్నామని పలువురు వాపోతున్నారు.

ప్రధానంగా నాలుగు మండలాల ముఖ్య కూడలి, నిత్యం రద్దీగా ఉండే వాణిజ్య కేంద్రమైన అడ్డురోడ్డులో ఆధార్ కేంద్రం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎస్.రాయవరం మండలంలో 15 గ్రామాలు, కోటవురట్ల మండలంలో 8, యలమంచిలి మండలంలో 5, నక్కపల్లి మండలంలో 10 గ్రామాల ప్రజలు నిత్యం అడ్డురోడ్డుకు వ్యాపార, నిత్యావసర సరుకులు, తదితర అవసరాల నిమిత్తం రాకపోకలు చేస్తుంటారు.


ఎస్.రాయవరం ఆధార్ నమోదు కేంద్రంలో ఎగబడుతున్న వినియోగదారులు

గత పాలనలో నిత్య సేవలు..

వైఎస్సార్‌సీపీ హయాంలో ఆధార్ కేంద్రాలతోపాటు, గ్రామ సచివాలయాల్లో ఆధార్ సేవలు అందిస్తూ ప్రజల సమస్యలను పరిష్కరించేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక సచివాలయాల్లో పౌర సేవలు సక్రమంగా అందడంలేదు. వివిధ సర్వేలు, ఇతర పనులకు సచివాలయ సిబ్బందిని వినియోగిస్తుండటంతో వారు ఎప్పుడు అందుబాటులో ఉంటారో తెలియని పరిస్థితి నెలకొంది. ఈ మధ్యకాలంలో రేషన్ ఈకేవైసీ, ఆధార్ అప్‌డేట్ కోసం ఎస్.రాయవరం వెళ్లాల్సి వచ్చింది. అక్కడ రద్దీ దృష్ట్యా పనులు పూర్తికాక పదే పదే మండల కేంద్రానికి తిరగాల్సి వచ్చిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మీసేవ సర్వీస్ ద్వారా రెండు ఆధార్ నమోదు కేంద్రాలు ఒకే చోట ఏర్పాటు చేశారు. సచివాలయాల్లో టూర్ క్యాంపు మాదిరిగా ఆధార్ నమోదు ప్రక్రియ చేపడుతున్నా, వినియోగదారులకు సక్రమంగా సేవలు అందడం లేదు. హోంమంత్రి నివాసముంటున్న అడ్డురోడ్డు కేంద్రంగా ప్రభుత్వ కార్యాలయంలో ఆధార్ నమోదు కేంద్రం ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.


నిత్యం రద్దీగా ఉండే అడ్డురోడ్డు జంక్షన్

పదే పదే తిరగాల్సి వస్తోంది



అడ్డురోడ్డు సమీప గ్రామాల్లో ఆధార్ కేంద్రం అందుబాటులో లేక నానా ఇబ్బందులు పడుతున్నాం. నక్కపల్లిలో ఆధార్ కేంద్రం పనిచేయడం లేదు. ఎస్.రాయవరంలో రద్దీ ఉంటోంది. యలమంచిలి వెళ్తే స్థానికులకు ముందు ప్రాధాన్యమిస్తున్నారు. దాంతో అక్కడికి పదే పదే తిరగాల్సి వస్తోంది. అడ్డురోడ్డులో ఆధార్ నమోదు కేంద్రం ఏర్పాటు చేయాలి.

– కుసుమంచి రాము, ఆధార్ వినియోగదారుడు, అడ్డురోడ్డు, ఎస్.రాయవరం మండలం

శాశ్వత ఆధార్ కేంద్రం అవసరం



శరవేగంగా అభివృద్ధి చెందుతున్న అడ్డురోడ్డు వాణిజ్య కేంద్రంలో శాశ్వత ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయాలి. ఆధార్ నమోదు కోసం ఎస్.రాయవరం వెళ్తే గంటలకొద్దీ వేచి ఉండటమే కాకుండా రోజూ తిరగాల్సి వస్తోంది. సమీప గ్రామాలైన తిమ్మాపురం, పెదగుమ్ములూరు సచివాలయాల్లో నిత్యం ఆధార్ సేవలు అందుబాటులో ఉంచాలి.

–దమ్ము సురేష్, యువకుడు, అడ్డురోడ్డు

వినతులు వస్తే ప్రభుత్వానికి నివేదిస్తాం



ఆధార్ నమోదు కేంద్రాలను ప్రభుత్వ ఉన్నతాధికారులే పర్యవేక్షిస్తున్నారు. అడ్డురోడ్డులో ఆధార్ కేంద్రం కావాలని వినతులు వస్తే ప్రభుత్వానికి నివేదిస్తాం. ఈ మధ్య కాలంలో ఆధార్ కేంద్రాల అవసరం పెరిగింది.

– జె.రమేష్‌బాబు, తహసీల్దార్, ఎస్.రాయవరం,

కార్మికుల పని గంటల పెంపు దుర్మార్గం

- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సత్యనారాయణ

మునగపాక: కార్మికుల పని గంటలు పెంచుతూ రాష్ట్ర క్యాబినెట్ తీసుకున్న నిర్ణయం దుర్మార్గమని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ విమర్శించారు. గురువారం ఆయన మాట్లాడుతూ కార్మికుల సంక్షేమం దృష్ట్యా లేబర్ కోడ్స్ అమలును తక్షణమే రాష్ట్రంలో నిలుపుదల చేయాలన్నారు. 8 గంటల పని కోసం 1886లో చికాగోలో పోరాడి సాధించుకున్న కార్మిక వర్గంపై 12 గంటల పనిని రుద్దడం ప్రజా వ్యతిరేకమన్నారు. కార్పొరేట్ వ్యవస్థలకు లాభం చేకూర్చేందుకు కార్మికులపై పని గంటల భారాన్ని మోపుతుందన్నారు. కనీస వేతనాలు పెంచకుండా కార్మికుల శ్రమను చంద్రబాబు తక్కువ చేసి చూపిస్తున్నారన్నారు. ఏఐ విస్తరించి మానవ శ్రమను తగ్గిస్తున్న నేటి ఆధునిక యుగంలో పని గంటలు తగ్గించాల్సింది పోయి పెంచడం దారుణమన్నారు. తక్షణమే లేబర్ కోడ్స్‌ను దాని అనుబంధ రూల్స్‌ను ఉప సంహరించుకోవాలన్నారు. వచ్చే నెల 9న జరగనున్న జాతీయ సమ్మెకు కార్మిక వర్గం మద్దతు పలకాలన్నారు.

మోడల్ స్కూల్‌లో సీట్ల భర్తీకి దరఖాస్తులు

మునగపాక: మండలంలోని పాటిపల్లి మోడల్ స్కూల్‌లో 6, 7, 8, 9 తరగతులతోపాటు ఇంటర్ మొదటి సంవత్సరంలో మిగులు సీట్లను భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి తెలిపారు. ఈ నెల 20 వరకు ప్రవేశాలకుగాను రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించేందుకు అవకాశం ఉందన్నారు. 10 నుంచి 20వ తేదీ వరకు సీట్లను భర్తీ చేసేందుకు దరఖాస్తులు తీసుకుంటామన్నారు. గతంలో ప్రవేశ పరీక్ష రాయని విద్యార్థులకు పాఠశాల స్థాయిలో 24న అవకాశం కల్పిస్తున్నామన్నారు. ఎంపికైన విద్యార్థుల జాబితాను 25న విడుదల చేస్తామన్నారు.

ఉగ్రవాదానికి వ్యతిరేకంగా నిరసన ర్యాలీ

అచ్యుతాపురం రూరల్: దేశ సమైక్యత వర్ధిల్లాలి.. ఉగ్రవాదం నశించాలని సీపీఎం జిల్లా కమిటీ అధ్యక్షుడు రొంగలి రాము, అచ్యుతాపురం శాఖ కార్యదర్శి కూండ్రపు సోమునాయుడు తెలిపారు. గురువారం అచ్యుతాపురం కూడలిలో మతసామరస్యం, దేశ సమగ్రత పరిరక్షణకు సీపీఎం ఆధ్వర్యంలో మహిళలు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ పహల్గాం ఘటనకు ప్రతిదాడిగా దేశ సైనికులు ఎంతో సాహసోపేతంగా ఉగ్రవాద స్థావరాలను మట్టు పెట్టి దేశ ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పారన్నారు. కార్యక్రమంలో ఆర్.లక్ష్మి, సత్యవతి, దేముడమ్మ పాల్గొన్నారు.


నిరసన ర్యాలీలో సీపీఎం నాయకులు, మహిళలు

'షైనింగ్ స్టార్' గ్రహీతకు అభినందన

అచ్యుతాపురం రూరల్: కైట్స్ కళాశాల విద్యార్థిని పి.సుప్రియ ఇంటర్మీడియట్‌లో (1000/988) అత్యధిక మార్కులు సాధించడంతో ప్రభుత్వం షైనింగ్ స్టార్ అవార్డు అందజేసింది. విద్యార్థినికి రూ.20 వేలతోపాటు గోల్డ్ మెడల్ అందజేసినట్లు కళాశాల కరస్పాండెంట్ రెడ్డి చిరంజీవి గురువారం తెలిపారు. ఈ మేరకు కళాశాల డైరెక్టర్లు రెడ్డి గణేష్, వి.ప్రసాద్, ఎ.శంకర్రావు అధ్యాపకులు అభినందనలు తెలిపారు.


విద్యార్థిని సుప్రియను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం, అధ్యాపక బృందం

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు


అచ్యుతాపురంలో వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్న గ్రంథాలయాధికారి కోటేశ్వర్రావు


గ్రంథాలయం ఆవరణలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు

అచ్యుతాపురం రూరల్: స్థానిక శాఖా గ్రంథాలయంలో వివిధ పాఠశాలల విద్యార్థులకు క్విజ్, చిత్రలేఖనం, స్వచ్ఛాంధ్ర స్వచ్ఛభారత్‌పై వ్యాసరచన పోటీలు గురువారం నిర్వహించారు. వేసవి శిక్షణ తరగతులు ఆఖరి రోజు అచ్యుతా పాఠశాల ఉపాధ్యాయుడు ఆర్.సత్యనారాయణ అవగాహన కల్పించారు. ఈ పోటీల్లో విజేతలకు శుక్రవారం బహుమతులు ప్రదానం చేస్తామని గ్రంథాలయాధికారి డి.కోటేశ్వర్రావు తెలిపారు.

పాయకరావుపేట: పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గురువారం 25 మంది విద్యార్థులతో వందేమాతరం పాడించారు. అనంతరం నీతి కథలు చెప్పారు. సీతారామమూర్తి విద్యార్థులకు సైన్స్ పాఠాలు నేర్పించారు. పర్యావరణ దినోత్సవం సందర్భంగా గ్రంథాలయ ఆవరణలో విద్యార్థులు, పాఠకులతో మొక్కలు నాటించారు. పాటల పోటీలు ఏర్పాటు చేశారు.

సంత ఆశీల వేలంపై కూటమి కుట్ర

అచ్యుతాపురం రూరల్: మోసయ్యపేట సంత ఆశీలు వేలం పాటపై కూటమి నాయకులు కుట్ర పన్నుతున్నారని సర్పంచ్ పంచదార్ల పైడిరాజు తెలిపారు. మార్చి 26న ఇక్కడ ఆశీలు వేలం నిర్వహించగా, అందరూ హాజరైనప్పటికీ ఈవోపీఆర్డీ రాకపోవడంతో అప్పటి సెక్రటరీ షేక్ శ్రీను వాయిదా వేశారన్నారు. వాస్తవంగా ఇక్కడ సంతను రామన్నపాలెం తరలించి తమ అనుకూల వ్యక్తికి వేలం దక్కించేందుకు కూటమి నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. సంత ఆశీల నిర్వాహకులకు తనకు ఎలాంటి లాలూచీ లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సంత ఆశీలు పాట నిర్వహించాలని కోరారు. అయితే వేలం పాట వాయిదా నుంచి గతంలో పాడిన వారు పంచాయతీకి పన్ను కడుతున్నారని ప్రస్తుత సెక్రటరీ తెలిపారు. వీరి నుంచి రెండు నెలల్లో రూ.79 వేల ఆదాయం సమకూరిందన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆశీల వేలం పాట నిర్వహిస్తామన్నారు.

'రజనీ కల్యాణం' చిత్ర యూనిట్ సందడి

సబ్బవరం: మండలంలోని సబ్బవరం శివారు చినగొల్లలపాలెం ముత్యాలమ్మతల్లి ఆలయం వద్ద వారాహి క్రియేషన్స్ యూనిట్ గురువారం సందడి చేసింది. గ్రామీణ నేపథ్యంలో రజనీకల్యాణ్ పల్ల దర్శకత్వంలో రూపుదిద్దుకోనున్న రజనీ కళ్యాణం చిత్ర షూటింగ్‌ను దర్శకుడు తన తల్లిదండ్రులతోపాటు సబ్బవరం ఉప సర్పంచ్ మండల లక్ష్మణ చేతుల మీదుగా అమ్మవారి సన్నిధిలో క్లాప్ కొట్టి, ప్రారంభించారు. చిత్ర నటీనటులను మీడియాకు పరిచయం చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు రజనీకల్యాణ్ మాట్లాడుతూ గ్రామీణ నేపథ్యంలో, రాజుల పరిపాలన, అప్పటి ప్రజల పరిస్థితిని ఇతివృత్తంగా తీసుకుని చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. రెండు షెడ్యూళ్లలో ఈ సినిమా షూటింగ్‌ను పూర్తిచేస్తామన్నారు. సబ్బవరం పరిసర ప్రాంతాల్లోని కళాకారులకు అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. అనకాపల్లి జిల్లా యాదవ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్ల తాతారావు మాట్లాడుతూ దర్శకుడు కల్యాణ్ ఇక్కడి రైతు కుటుంబంలో జన్మించినా, సినీ పరిశ్రమపై మక్కువతో ఇక్కడి వరకు వచ్చారని తెలిపారు. పల్ల సత్యనారాయణ, పల్ల అప్పలనాయుడు నిర్మాణంలో రూపొందుతున్న ఈ చిత్రంలో నటీనటులు గెద్దం రమణ, శర్వాణి, సుస్మిత, కెమెరామన్‌గా రమణ, డ్యాన్స్ మాస్టర్‌గా దాలినాయుడు, ఫైట్ మాస్టర్‌గా సంతోష్ కుమార్, రచయితగా డి.శ్రీనివాసరావు పనిచేస్తున్నారు.


ముత్యాలమ్మ గుడిలో క్లాప్ కొడుతున్న యూనిట్

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

- కోర్టు ప్రాంగణంలో మొక్కలు నాటిన న్యాయమూర్తి


కోర్టు ప్రాంగణంలో మొక్క నాటుతున్న న్యాయమూర్తి స్పందన, అటవీ సిబ్బంది

యలమంచిలి రూరల్: మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షిద్దామంటూ ప్రజలకు స్థానిక పీడీఎం కోర్టు న్యాయమూర్తి జి. స్పందన పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక అటవీ సిబ్బందితో కలిసి కోర్టు ప్రాంగణంలో ఆమె మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు పర్యావరణాన్ని పరిరక్షించడానికి, వాటి సంరక్షణ బాధ్యత చూడాలన్నారు. కార్యక్రమంలో యలమంచిలి అటవీ బీట్ అధికారి బీవీ రమణ, సిబ్బంది, న్యాయవాదులు పాల్గొన్నారు. యలమంచిలి అన్న క్యాంటీన్ వద్ద ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలంతా ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలన్నారు. అధికారులు, నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి

మునగపాక: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ కోరారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా గురువారం ఆయన మెలిపాకలో మొక్కలు నాటడంతోపాటు రైతులకు టిల్లర్లు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.ఆదిమహేశ్వరరావు, మండల పరిషత్ సూపరింటెండెంట్ ప్రసాద్, ఏవో సీహెచ్ జ్యోత్స్నకుమారి, నాయకులు పాల్గొన్నారు.


ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటుతున్న అధికారులు, నాయకులు

పాయకరావుపేట: వన మహోత్సవంలో భాగంగా మండలంలో పలు గ్రామాల్లో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించామని ఎంపీడీవో జయప్రకాష్ రావు తెలిపారు. మండలంలో పెదరాంభద్రపురం, రాజగోపాలపురం, అరట్లకోట, సీతారాంపురం, మంగవరం తదితర గ్రామాల్లో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ సిహెచ్.చంద్రశేఖర్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు. అనంతరం వన సంరక్షణపై ప్రతిజ్ఞ చేయించారు.

మొక్కలు నాటండి పర్యావరణాన్ని కాపాడండి

అచ్యుతాపురం రూరల్: ప్రాణికోటికి చెట్లు ఆధారమని ఎంపీడీవో ప్రభాకర రావు తెలిపారు. స్థానిక మండల అభివృద్ధి కార్యాలయ ఆవరణలో ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితిల్లో అచ్యుతాపురంలో వెలుస్తున్న పరిశ్రమల కారణంగా ఏర్పడుతున్న కాలుష్యాన్ని అరికట్టాలంటే ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటాలన్నారు. మండలంలో దుప్పితూరు, ఉప్పవరం గ్రామాల్లో నాయకులు మొక్కలు నాటారు. ఈవోపీఆర్డీ శ్రీరామమూర్తి నాయుడు, ఎంపీపీ కోన సంధ్య బుజ్జి, అచ్యుతాపురం సర్పంచ్ కూండ్రపు విమలా నాయుడు, సెక్రటరీ శైలజ, జేఈ నాయుడు, ఏవో రాము, ప్రగడ రాజు, చిన్ని శ్రీను, కూనిశెట్టి సత్తిబాబు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పర్యావరణ దినోత్సవం

కోటవురట్ల: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు కోరారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం కోటవురట్లలో పల్లె వనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ శుభకార్యాల్లో మొక్కలు నాటడం అలవాటుగా చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.అనిల్ కుమార్, ఎంపీటీసీ పుత్రేవు వెంకట సూర్యారావు, టీడీపీ జిల్లా కార్యదర్శి లాలం కాశీనాయుడు, జనసేన మండల అధ్యక్షుడు శ్రీను, ఏపీవో నాగరాజు పాల్గొన్నారు.


టిల్లర్ అందజేస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్


మొక్కలు నాటుతున్న ఈవోపీఆర్డీ చంద్రశేఖర్


కోటవురట్లలో ర్యాలీ చేస్తున్న నాయకులు

అదృశ్యమైన బాలుడి ఆచూకీ లభ్యం

పెందుర్తి: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలోని అప్పన్నపాలేనికి చెందిన బాలుడి(12) ఆచూకీ లభ్యమైనట్లు సీఐ కె.వి.సతీష్‌కుమార్ తెలిపారు. మూడు రోజుల క్రితం ఇంటి నుంచి నూడుల్స్ కోసం వెళ్లిన ఆ బాలుడు తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు నగరంలో బాలుడి ఆచూకీని గురువారం కనుగొని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

అప్పన్నకు ఘనంగా ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణపుష్పార్చన జరిపారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం జరిపారు. 108 స్వర్ణ సంపెంగలతో అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

వైభవంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులను వేంజేపచేసి, ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని ఘనంగా జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.


కంకణధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

భక్తి భావం పెంపొందించుకోవాలి


ప్రవచన కర్త నరసింహమూర్తిని సత్కరిస్తున్న దృశ్యం

మునగపాక: ప్రతి ఒక్కరూ భక్తి భావాలను పెంపొందించుకోవాలని మాజీ సర్పంచ్ మళ్ల రమణమ్మ కోరారు. వాడ్రాపల్లి పెద రామాలయంలో నెల రోజులుగా పెతకంశెట్టి రామజోగినాయుడు, గ్రామస్తుల సహకారంతో రామాయణ ప్రవచనం నిర్వహిస్తూ వచ్చారు. దీనిలో భాగంగా గురువారం హిందూ ధర్మ ప్రచార సమితి, టీటీడీ ధర్మాచార్య బుద్ధ నరసింహమూర్తిని ఘనంగా సత్కరించారు. రమణమ్మ మాట్లాడుతూ ప్రజల్లో భక్తి భావాలను నింపేందుకు నరసింహమూర్తి అందించిన సేవలు అభినందనీయమన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పాయకరావుపేట డివిజన్:
9951602901
Office mail : sakshiadvtvsp@gmail.com